క్లుప్తంగా

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేయాలి



మాట్లాడుతున్న అధికారులు

మందస: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది కృషి చేయాలని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు, స్త్రీనిధి క్లస్టర్ మేనేజర్ సాయిరాం అన్నారు. మందస పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాయలంలో శనివారం సిబ్బందితో జరిగిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఎంఎంఎస్ కోశాధికారి బాలక విజయశ్రీ, లీగల్ కోఆర్డినేటర్ జమ్మా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మందస: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు అన్నారు. మూలిపాడు, సొండిపూడి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తుండడంతో ఉద్యమంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు, ఈఓపీఆర్డీ కె.జయప్రకాశ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహాయం



సాయాన్ని అందజేస్తున్న వసంతరెడ్డి

సంతబొమ్మాళి: ఆకాశలక్కవరం గ్రామంలో సూరమ్మ తల్లి అమ్మవారి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. దీని పనుల కోసం జెడ్పీటీసీ సభ్యుడు పాలవసంత రెడ్డి పది వేల రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ పెద్దలకు శనివారం అందజేశారు.

పోటీ పరీక్షల అభ్యర్థులకు పుస్తకాల వితరణ



పోటీ పరీక్షల పుస్తకాలను అందజేస్తున్న సీడాప్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం: గ్రూప్ 1, 2 పరీక్షలకు సిద్ధమవుతున్న పేద కుటుంబాలకు చెందిన అభ్యర్థులను ప్రోత్సహించేందుకు వారికి అవసరమయ్యే పుస్తకాలను అందజేస్తున్నట్లు సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో వాసంతి నర్సింగ్ హోమ్ ఆవరణంలో శనివారం నియోజకవర్గంలోని గ్రూప్ 1, 2 పరీక్షలకు సిద్ధమవుతున్న ఎనిమిది మంది అభ్యర్థులకు అవసరమయ్యే జాగ్రఫీ, భారతదేశ చరిత్ర, ఇండియన్ పాలిటిక్స్, భారతీయ సమాజం, భారతీయ రాజ్యాంగం, భారతదేశ ఆర్థిక సర్వే, సైన్స్ అండ్ టెక్నాలజీ, విజేత కాంపిటేషన్స్ వారి మెంటల్ ఎబిలిటీ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖ వైద్యుడు డాక్టర్ డి.త్రినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకులు, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దు

టెక్కలి: వాల్మీక, బోయలను ఎస్టీల జాబితాలో చేర్చవద్దని వివిధ సంఘాల ప్రతినిధులు కోరారు. కుల నిర్మూలనా పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం టెక్కలి అంబేడ్కర్ భవన్‌లో వివిధ ప్రజా సంఘాలతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. కేఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కృష్ణయ్య మాట్లాడుతూ.. బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విషయమై ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ఎన్.షణ్ముఖరావు, జి.రమణమూర్తి, బి.ప్రభాకరరావు, కె.ధర్మారావు, ఎస్.షణ్ముఖరావు, బి.తిరుపతిరావు, ఎన్.నాగరాజు, కె.పాపారావు, ఎస్.పోలయ్య పాల్గొన్నారు.

నేడు చినంచలలో మహాయజ్ఞం

కాశీబుగ్గ: చినంచల గ్రామంలో ఆదివారం ఉదయం మహాయజ్ఞం జరగనుంది. నెమలికొండ దత్తాత్రేయ ఆశ్రమ అధిపతి సదానంత సద్గురు స్వామి హజరై శాంతి యజ్ఞం చేస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.

లారీ డ్రైవర్ దుర్మరణం

సోంపేట: కొర్లాం జాతీయ రహదారిపై శనివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో జరిగిన ప్రమాదంలో లారీ డ్రైవర్ బుంగా సూరో (58) మృతి చెందాడు బారువ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం నుంచి ఒడిశా వెళ్తున్న లారీని డ్రైవర్ బుంగా సూరో కొర్లాం జాతీయ రహదారి సమీపంలో తొమ్మిది గంటల ప్రాంతంలో నిలిపాడు. టీ తాగేందుకు వెళ్లి తిరిగి లారీ వద్దకు వెళ్తుండగా.. పలాస నుంచి ఇచ్ఛాపురం వెళ్తున్న ఐచర్ వ్యాన్ అతన్ని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. బుంగా సూరో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని స్వగ్రామం బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం వడ్లపూడి.

ఇచ్ఛాపురంలో భారీ వర్షం

ఇచ్ఛాపురం రూరల్: వరినారు ఎండిపోతున్న దశలో వరుణుడు కురుణించాడు. మండలంలో శనివారం భారీ వర్షం కురవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజల కోసం 'జగనన్న సురక్ష'

ప్రజల కోసం.. వారి సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. కార్యక్రమంలో భాగంగా 11 సేవలను ఉచితంగా అందజేస్తున్నట్టు చెప్పారు. టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో శనివారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' సభల్లో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు నర్తు రామారావు, దువ్వాడ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.



టెక్కలిలోని 3, 4 సచివాలయాల వద్ద లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, సర్పంచ్ సుజాత తదితరులు



కవిటి: సీహెచ్‌కపాసుకుద్దిలో సర్టిఫికెట్లను అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు



నందిగాం: లఖిదాసుపురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ తదితరులు



సంతబొమ్మాళి: మేఘవరం, లక్కీవలస సచివాలయం వద్ద సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి



పలాస: తర్లాకోటలో సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టిబాబు తదితరులు



కోటబొమ్మాళి: నీలంపేటలో సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టిలో సర్టిఫికెట్లను అందజేస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, శాసనమండలి సభ్యుడు నర్తు రామారావు



ఇచ్ఛాపురం రూరల్: బిర్లంగిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు



సోంపేట: బేసిరామచంద్రాపురంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్.



మందస: కొంకడాపుట్టిలో మాట్లాడుతున్న ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు



కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 11వ సచివాలయంలో పత్రాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు

మత్స్యకార సొసైటీ అధ్యక్షుడుగా లక్ష్మణరావు ఎన్నిక

వజ్రపుకొత్తూరు: దేవునల్తాడ సాగర మత్స్యకార సొసైటీ అధ్యక్షుడుగా అంబటి లక్ష్మణరావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్ టి.వరదరాజు అధ్యక్షతన సొసైటీ సభ్యులు శనివారం సమావేశమై వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడైన లక్ష్మణరావును అధ్యక్షుడుగా, కార్యదర్శిగా నందుపల్లి తులసీరావును ఎన్నుకున్నారు. గతంలో సొసైటీ అధ్యక్షుడుగా పని చేసిన సిరిగిడి వాసుదేవరావు అకాలమరణం తరువాత ఆ పదవి ఖాళీగా ఉంది. మంత్రి సీదిరి అప్పలరాజు ఆదేశాలతో సొసైటీకి పూర్తిస్థాయి అధ్యక్షుడు ఉండాలని భావించి ఈ మేరకు ఎన్నిక నిర్వహించారు. నూతన అధ్యక్షుడు లక్ష్మణరావును సర్పంచ్ టి.వరదరాజు, ఎంపీటీసీ సభ్యుడు సొదాల వెంకన్న, మాజీ సర్పంచ్ సీదిరి చిరంజీవి అభినందించారు. గ్రామ పెద్దలు బి.రామరావు పిల్లా, ఎ.సత్యరాజు, గాలి ఉమారావు, సచివాలయ కన్వీనర్లు కుమార్, చంటి పాల్గొన్నారు.



లక్ష్మణరావును అభినందిస్తున్న గ్రామ పెద్దలు

పంది కరిచి మహిళకు గాయాలు

టెక్కలి రూరల్: పందిదాడి చేసి కరిచిన ఘటనలో మహిళ గాయపడింది. ఈ సంఘటన టెక్కలిలోని పాత జిల్లా ఆస్పత్రి సమీపంలో శనివారం చోటుచేసుకుంది. చాకిపల్లి గ్రామానికి చెందిన కె.జానకమ్మ మనవడుతో కలిసి ఆస్పత్రి సమీపంలోని మసీదు వద్దకు తావీదు కట్టించుకునేందుకు వచ్చారు. ఆ సమయంలో అక్కడ ఉన్న పిల్లల పంది జానకమ్మపై దాడి చేసి కరవడంతో గాయపడింది. ఆమెను స్థానిక జిల్లా ఆస్పత్రికి అక్కడ ఉన్నవారు తరలించగా వైద్యులు చికిత్స చేశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



డ్రైనేజీలు పరిశీలిస్తున్న అధికారులు

సోంపేట: పలాసపురం పంచాయతీలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చడానికి సహాయ సహకారాలు అందజేయాలని గ్రామ సర్పంచ్, మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు కోరారు. డ్రైనేజీ మరమ్మతులు, నూతనంగా నిర్మించాల్సిన డ్రైనేజీల గురించి డీఈకి సర్పంచ్ వివరించారు. జేఈ అబ్బాస్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మణిపూర్ దోషులను శిక్షించాలి

టెక్కలి: గిరిజనులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సమతా సైనిక్ దళ్ జిల్లా సమన్వయకర్త చల్లా రామారావు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో ఇటీవల జరిగిన సంఘటనపై శనివారం టెక్కలి అంబేడ్కర్ జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మణిపూర్ సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈయనతో పాటు పి.చంటి, పి.నాగేశ్వరరావు, డి.సునీత, ఎ.మాధవరావు, కె.కామేశ్వరరావు, ఎస్.దామోదరరావు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల నేస్తం సీఎం జగన్

- వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి

టెక్కలి: చేనేత కార్మికుల నేస్తం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదో విడత సాయం విడుదలైన సందర్భంగా నియోజకవర్గంలోని చేనేత కార్మికులంతా శనివారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. పూర్తిగా అణగారి పోయిన తమ కుటుంబాల్లో వెలుగులు నింపే విధంగా ముఖ్యమంత్రి ఆర్థిక సాయం చేస్తున్నారని చేనేత కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.దీప్తి, ప్రతినిధులు బి.కృష్ణారావు, ఎం.శంకర్, నాయకులు బి.హరి, టి.రామారావు, ఎస్.లావన్న, బి.సూర్యం, శివరావ్, ఎల్లయ్య, వి.ఆదినారాయణ పాల్గొన్నారు.



చేనత కార్మికులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దువ్వాడ వాణి

సీఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- ముండ్ల సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కంచిలి: అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరువ చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని ముండ్ల గ్రామ సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని వివరించారు. ఇంకా ఏమైనా కావాలా అని అడిగి తెలుసుకున్నారు. నిరంతరం ప్రజల కోసం పని చేస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, స్థానిక సర్పంచ్ రామచంద్ర ప్రధాన్, ఎంపీటీసీ సభ్యుడు భగవాన్ ప్రధాన్ పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న చైర్‌పర్సన్ విజయ, సమన్వయకర్త సాయిరాజ్

ఇంటింటికీ మంచినీటి సౌకర్యం

నందిగాం: ప్రతి ఇంటికీ మంచినీటి సౌకర్యం కల్పించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. లఖిదాసుపురం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.30 లక్షలతో ఏర్పాటు చేయనున్న రక్షిత మంచినీటి పథకానికి నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాలకు రక్షిత మంచినీటి సౌకర్యాన్ని ప్రభుత్వం సమకూరుస్తోందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధు, నాయకులు బొంగి మోహనరావు, కురమాన బాలకృష్ణ, మాదిన గోపాలకృష్ణ, నడుపూరు పాపారావు, సిమ్మయ్య, జోగారావు, లిమ్మ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



నీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న తిలక్

ప్రజాసంఘాల నిరసన

టెక్కలి: కులనిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్ అరెస్టును ఖండిస్తూ ప్రజాసంఘాల సభ్యులు టెక్కలిలో శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. ఎన్ఐఏ ఉప చట్టం రద్దు చేయాలని, మణిపూర్ సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని, కామ్రేడ్ శిరీషను తక్షణమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు కోదండం, పి.అరుణ, సోమనాథం, కె.ధర్మారావు, ఎం.కృష్ణయ్య, ఎస్.వి.జగన్నాథం, బి.ప్రభాకర్ పాల్గొన్నారు.



నిరసనలో ప్రజా సంఘాల సభ్యులు

కళాశాలలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం

మందస: మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల దాహార్తి ఎట్టకేలకు తీరింది. సుమారు 500 మంది విద్యార్థులు చదువుతున్న ఈ కళాశాలలో గతంలో సమస్యలుండేవి. 'నాడు-నేడు' పథకంలో భాగంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి మౌలిక సదుపాయాలను కల్పించింది. ఇందులో భాగంగా వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు శనివారం ప్రారంభించారు. నాడు-నేడు పథకంలో భాగంగా మంజూరైన భవనాలు, మరుగుదొడ్లు, తరగతి గదుల నిర్మాణ పనులు కూడా పూర్తి కావస్తున్నాయి. మంచినీటి సమస్య పరిష్కారం కావడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటం పట్టుకుని.. థాంక్యూ సీఎం సార్ అంటూ కేరింతలు కొట్టారు. కార్యక్రమంలో అధ్యాపకులు మార్పు కృష్ణమోహన్, గురుగుబెల్లి రమణమూర్తి, హనుమంతు విజయలక్ష్మి, బొడ్డు ప్రవీణ్‌కుమార్, లోకనాథం, సోమేశ్వరరావు, సాప నరేష్‌కుమార్ పాల్గొన్నారు.



వాటర్‌ప్లాంట్ ప్రారంభంలో కళాశాల సిబ్బంది

పాఠశాలకు రూ. 10 వేల వితరణ

కాశీబుగ్గ: మాకన్నపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పూర్వ ఉపాధ్యాయుడు ఎస్.కూర్మారావు పది వేల రూపాయలను వితరణ చేశారు. ఈ మొత్తాన్ని పాఠశాల సిబ్బందికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు డి.గోవిందరావు, టి.అప్పలస్వామి, కె.ధర్మారావు, ఎస్.దేశయ్య, కుత్తుం వినోద్, టి.మోహిని, బి.ఓంకారం, ఆర్.కృష్ణారావు, జి.శ్రీనివాసరావు, జి.ఆంజనేయులు, కె.కోటేశ్వరరావు ఉన్నారు.

అక్రమ కట్టడాలతో ఆదాయానికి గండి

- మున్సిపల్ సమావేశంలో సభ్యులు
- చర్యలు చేపట్టాలని చైర్మన్ గిరిబాబు ఆదేశం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చట్టబద్ధంగా రావాల్సిన ఆదాయం పక్కదారి పడుతోందని మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్ అన్నారు. ఇది ప్రభుత్వానికి తీరని నష్టం కలిగించే అంశమన్నారు. మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు ఆధ్వర్యంలో మున్సిపల్ అత్యవసర సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి యూనిట్‌గా చేసుకుని సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. అలాగే మంత్రి సీదిరి అప్పలరాజు మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చదిద్దాలని చూస్తుంటే కొంతమంది వ్యక్తులు కొందరు అధికారులను అడ్డుపెట్టుకుని మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయాన్ని తమ సొంతానికి దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. అన్ని శాఖల అనుమతులు, ప్రభుత్వానికి కట్టాల్సిన చలానాలు చెల్లించకుండానే లంచం రూపంలో అందించి కట్టడాలు నిర్మించేస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. నాలా పన్ను కట్టకుండా కొంతమంది టీడీపీ నాయకులు రియల్ ఎస్టేట్ దందా నడుపుతున్నారని.. ఇందులో కొంతమంది పెద్దలు కూడా ఉన్నారన్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని తనిఖీలు చేపట్టి చర్యలు చేపట్టకపోతే ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడే అవకాశం ఉందన్నారు. చైర్మన్ గిరిబాబు స్పందిస్తూ.. మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, టీపీఎస్ అధికారులతో మాట్లాడారు. మున్సిపాలిటీలో ఇటీవల నూతనంగా నిర్మించిన కట్టడాలకు ఎలా అనుమతులు ఇచ్చారు, అన్నీ సక్రమంగా ఉన్నాయా..లేదా తనిఖీ చేయాలని ఆదేశించారు. తప్పు జరిగినట్టు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మున్సిపాలిటీకి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

మున్సిపల్ విప్ శంకర్‌పండా మాట్లాడుతూ.. మున్సిపల్ ఉద్యోగులు కౌన్సిలర్లకు కనీస గౌరవం ఇవ్వడం లేదన్నారు. పలువురు కౌన్సిలర్లు పలు సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణారావు, కౌన్సిలర్లు బెల్లాల శ్రీనివాసరావు, పోతనపల్లి ఉమాకుమారి, దున్న నిర్మల, పిచ్చుకల అజయ్, సనపల సింహాచలం, త్యాడి, రోణంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సభ్యులు

ఐసీడీఎస్‌ను బలోపేతం చేద్దాం

- ఏపీ అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ

కాశీబుగ్గ: ఐక్యపోరాటాలతో ఐసీడీఎస్‌ను బలోపేతం చేద్దామని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావమ్మ అన్నారు. స్థానిక ఎస్ఎంసీ కల్యాణ మండలంలో యూనియన్ జిల్లా ఎనిమిదో మహాసభల సందర్భంగా 'ఐసీడీఎస్‌ను కాపాడుకుందాం-ఐక్యంగా పోరాడుదాం'అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు డి.సుదర్శనం అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో సుబ్బారావమ్మ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఉపయోగపడే పథకాలను క్రమేపీ దూరం చేస్తోందన్నారు. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించటానికి ఆధార్ కార్డును లింక్ చేసిందన్నారు. ఐసీడీఎస్ బలోపేతానికి నిధులు పెంచాలని, పిల్లల విద్యను బలోపేతం చేయాలని, అందరికీ నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శులు ఎస్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ, యూనియన్ పలాస ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మంజులాకుమారి, బి.ఆదిలక్ష్మి జిల్లా కోశాధికారి కె.కల్యాణి, నాయకులు, పి.లతాదేవి, బి.ఆదిలక్ష్మి, వి.హేమవతి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పతాకావిష్కరణ దినోత్సవం

ఇచ్ఛాపురం: పట్టణంలోని సీబీఎస్ఈ పాఠశాల జ్ఞానభారతి ఆవరణలో జాతీయ పతాకావిష్కరణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జాతీయ జెండా విశిష్టతను వక్తలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి జోహార్‌ఖాన్, రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి పండా, రషీదాసుల్తానా, ప్రేమ్‌కుమార్, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు..



జాతీయ పతాకావిష్కరణ దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

రెండో సెమిస్టర్ పుస్తకాలు పంపిణీ

కాశీబుగ్గ: పలాస మండలం, కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు రెండో సెమిస్టర్ పుస్తకాల పంపిణీ పూర్తయిందని ఎంఈవో సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. అన్ని పాఠశాలల్లోని పిల్లలకు వీటిని పంపిణీ చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించామన్నారు.